

ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

భక్తితో మానసిక ప్రశాంతత: ఎంపీ అనిల్

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్‌లోని సబర్మతినగర్‌లో రేణుక ఎల్లమ్మ, నలపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నర్సింగ్ రావు, సభ్యులు నర్సింగ్‌ముదిరాజ్, లక్ష్మణ్, జగన్, కుమార్ పాల్గొన్నారు.

కొత్తరేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి

● సీపీఎం నేతల డిమాండ్

నల్లకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సివిల్ సప్లయ్ సర్కిల్ 6 ఏఎస్‌వో దీప్తికి సీపీఎం నేతలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్, నాయకులు వెంకటమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న నోయెల్ సీన్

ఉత్సాహంగా తరంగోత్సవం

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట చెన్నైస్ అమీర్త హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో తరంగోత్సవం-2025 కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ నోయెల్‌సీన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ, పాశ్చాత్య శైలిలో నృత్యాలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన వారికి నోయెల్‌సీన్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ చైర్మన్ ఆర్ బూమీనాథన్, మారియట్ ఇంటర్నేషనల్ మల్టీప్రాపర్టీ జీఎం విశాల్ మెహ్రా, డైరెక్టర్ కిరణ్‌ప్రీత్‌కౌర్, కళాశాల ప్రతినిధులు రవిశంకర్, లావణ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'జీవో 89 విడుదల హర్షణీయం'

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జీవో 89ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని డీఎస్‌బీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటంనేని వెంకటేష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, సదరం మెడికల్ పత్రాలు ఉన్న దివ్యాంగులకు చదువులతో నిమిత్తం లేకుండా బధిరులకు 4జీ మొబైల్ ఇవ్వాలని, దివ్యాంగులకు ఇతర సహాక పరికరాలు ఇవ్వాలని తాము చేసిన విజ్ఞప్తులకు సీఎం స్పందించి జీవో 89 విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంకల్ప సభలు: గౌతంరావు



మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరావు

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 25 వరకు సంకల్ప సభలు, శక్తి కేంద్రాల వారీగా రచ్చబండలు, జిల్లా స్థాయిలో ప్రొఫెషనల్ మీట్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌తో పాటు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పార్టీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు తెలిపారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీ చీకటి రోజులను నేటి యువతకు తెలియజేసే విధంగా ప్రతి డివిజన్‌లో పెద్దఎత్తున సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. 23న డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యక్రమాల కన్వీనర్ యెడెల్లి అజయ్ కుమార్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు నందకిషోర్ యాదవ్, కృష్ణాగౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

● కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ కోరారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వారు అన్నారు. అనంతరం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్, లక్ష్మణ్, భార్గవ్, కృష్ణమాచారి, ఉపాధ్యాయులు రతన్, పద్మ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు

గోల్నాక, రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులకు, మత పెద్దలకు కార్పొరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్, పద్మావెంకటరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. గోల్నాక డివిజన్‌లోని లాల్‌బాగ్ మజీద్‌ను డివిజన్ కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్, బాగ్‌అంబర్‌పేటలో మసీదుల వద్ద ముస్లింలకు కార్పొరేటర్ పద్మ ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు.

చేప మందులో శాస్త్రీయత లేదు : జేవీవీ నేతలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాంచంద్రయ్య

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చేప మందు పంపిణీకి ప్రభుత్వ సహకారం తగదని, చేపమందులో శాస్త్రీయత లేదని జేవీవీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేవీవీ సైన్స్ కమ్యూనికేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రాంచంద్రయ్య, వేదిక ప్రధానకార్యదర్శి రాజాలు మాట్లాడారు. ప్రతియేటా జూన్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాద పంపిణీకి ప్రభుత్వం సహకారం అందించడం సరికాదన్నారు. చేప ప్రసాదంతో ఆస్తమా తగ్గదన్నారు. ఆస్తమా రోగులకు సరైన వైద్యం అందించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జేవీవీ నేతలు డా. రజని, లింగస్వామి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటిసెంట్రల్‌లైబ్రరీ ఆవరణలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ, ఉద్యోగ సంఘం నాయకులు మహేందర్, అవినాశ్‌రావు, వెంకటేశ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, చంద్రకళ, సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదమ్మ, విశ్రాంత ఉద్యోగులు చంద్రయ్య, దేవేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిక్కడపల్లి మార్కెట్‌లో కూల్చివేతల కలకలం

కొలతలు తీసుకునేందుకు వచ్చిన మున్సిపల్ సిబ్బంది

- అడ్డుకున్న షాపుల యజమానులు, బీజేపీ నేతలు
- వారం గడువు కోరిన కార్పొరేటర్
- సంఘటన ప్రదేశాన్ని సందర్శించిన మాజీ ఎంపీ



ముున్సిపల్ మార్కెట్ కూల్చివేతలను అడ్డుకుంటున్న కార్పొరేటర్, బీజేపీ నేతలు

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి మార్కెట్ కూల్చివేతకు మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మార్కెట్ ప్రాంతంలో కొలతలు తీసుకునేందుకు శుక్రవారం వచ్చిన అధికారులను షాపు యజమానులు, బీజేపీ నేతలు, స్థానిక కార్పొరేటర్ అడ్డుకున్నారు. కాసేపటికి మాజీ ఎంపీ వి. హనుమంతరావు కూడా సంఘటన స్థలానికి చేరుకుని కూల్చివేత చర్యలను తప్పుపడుతూ వ్యాపారుల జీవనాధారాన్ని తీసేయడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. మార్కెట్ కూల్చివేతకు వారం గడువు కావాలని కార్పొరేటర్ అధికారులను కోరడంతో, ఆమె కోరిక మేరకు అధికారులు వెనుదిరిగిపోయారు.

కూల్చివేతకు తాత్కాలిక బ్రేక్..

గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్, కృష్ణపత్రిక భవనాలను కూల్చివేతకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ భవనాలను కూల్చివేసే పనుల్లో భాగంగా అధికారులు కొలతలు చేపట్టారు. తొలుత పూర్తిగా శిథిలావస్థకు చేరిన కృష్ణ పత్రిక భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కృష్ణ పత్రిక భవనాన్ని కూల్చితే తమ షాపులన్ని పోవడం, జీవనోపాధి కోల్పోవడం ఖాయమని మార్కెట్‌లోని షాపుల వారు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ అసోసియేషన్ సభ్యులు విషయాన్ని స్థానిక కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు దృష్టికి తీసుకెళ్లారు. హుటాహుటిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, పార్టీ నేతలతో కలిసి కార్పొరేటర్ పావని చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్‌కు చేరుకున్నారు. మార్కెట్ కమిటీ అసోసియేషన్ సభ్యులు, షాపుల వారు, స్థానిక బాపునగర్ బస్తీ వాసులతో సంప్రదింపులు జరిపారు. కూల్చివేతకు వారి విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సుదర్శన్, స్ఫూర్తి, టౌన్ సిబ్బందితో వారం సమయం కావాలని కోరారు. కార్పొరేటర్ సూచన మేరకు అధికారులు వెనుదిరిగారు. కృష్ణపత్రిక భవనం స్థానంలో తమకు ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని బాపునగర్ బస్తీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. వెంటనే ఆ సమాచారాన్ని కార్పొరేటర్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి కమ్యూనిటీ హాల్ విషయంలో చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీనిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు బాపునగర్ బస్తీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పొన్నంతో మాట్లాడిన వీహెచ్

రాంనగర్: నగరంలోని చిక్కడపల్లిలోని మున్సిపల్ షాపులలో దీర్ఘకాలంగా అద్దెకు ఉంటూ వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న 72 మంది షాపుల నిర్వాహకులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే షాపులను ఖాళీ చేయించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు కూల్చివేతలను ఆపివేయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిలిచివేతలను ఆపివేయించారు.

చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ యార్డ్



పెండింగ్‌లోనే మార్కెట్ నిర్మాణం..

చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ యార్డ్‌ను తొలగించి తొమ్మిది అంతస్తులతో నూతన మార్కెట్ యార్డ్‌ను నిర్మించాలని బీఆర్ఎస్ హయాంలోనే ప్రతిపాదన చేశారు. అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ మార్కెట్‌ను సందర్శించి అధునాతన మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని హామీనిచ్చారు. ఈ విషయంపై గతంలో "అధునాతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మోక్షం కలిగేనా?" శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. ఎట్టకేలకు జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు స్పందించారు. శుక్రవారం చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్‌కు చేరుకున్నారు. నూతన మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి కొలతలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు, బీజేపీ నేతలు, స్థానిక కార్పొరేటర్ పావని అధికారులను అడ్డుకున్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, జంతువులను వధించడం వల్ల వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా బ్యాగుల్లో వేసి చెత్తను సేకరించే కార్మికులకు అందజేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్దిక్‌నగర్, అంజుమన్ వీధిలో ఇంటింటికి ప్లాస్టిక్ బ్యాగులను పంపిణీ చేశారు. చెత్తను తొలగించేందుకు ప్రత్యేక వాహనాలు సైతం అందుబాటులో ఉంచామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అక్లక్ హుస్సేన్, మహ్మద్‌అలీ, ముచ్చకుర్తి ప్రభాకర్, సైఫ్ ఉద్దీన్ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌పాఠశాల సమీపంలో చేపడుతున్న కచ్చామోరీ పైప్‌లైన్ నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుక్రవారం పరిశీలించారు.అనంతరం సమీపంలోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రజక, నాయీ బ్రాహ్మణుల ఉచిత కరెంట్ పథకం, పెండింగ్ బిల్లుల విడుదలకై ఈ నెల 17న తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమ పోస్టరును శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పైళ్ల ఆశయ్య, నాయకులు విష్ణు, నరేష్, మల్లేష్, గోపాల్ పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత: అంజని

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సంగీతంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సిటీ సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారి అన్నారు. ఎస్పీబీ, ఇళయరాజ జన్మదినం సందర్భంగా వావ్ మ్యూజిక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్ కళాభారతి సిటీ కల్చర్ సెంటర్‌లో గీతాలాపన కార్యక్రమం జరిగింది. ఔత్సాహిక గాయనీగాయకులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అంజని అన్నారు. నిర్వాహకులు వెంకటలక్ష్మి, ఇతరులు అంజనికుమారిని సన్మానించారు.

'బతుకమ్మకుంట సుధాకర్‌రెడ్డిది కాదు'

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట కుంట స్థలం బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డిది కాదని, ఆ స్థలంపై ఆయనకు ఏ హక్కు లేదని, తప్పుడు పత్రాలతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్; కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్‌లు ఆరోపించారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బతుకమ్మకుంట స్థలం సుధాకర్‌రెడ్డిది కానేకాదని, ఆయన దగ్గర సేల్ డీడ్ లేదని, ఆజాం చనిపోయాక నకిలీ పత్రాలను సృష్టించి అగ్రిమెంట్ చేసుకున్నాడని ఆరోపించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

● హామీ ఇచ్చిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి పొంగులేటితో శ్యామ్

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి హౌసింగ్ బోర్డు షాప్ నిర్వాహకుల ఓనర్‌షిప్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీనిచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్యామ్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంత్రిని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శులు వాసు, కుమార్, సభ్యులు యోగి, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, మన్మోహన్, అశోక్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

9న కృష్ణా - గోదావరి జలాల వాటాపై సమావేశం



మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణా - గోదావరి నది జలాల్లో ఏపీ, తెలంగాణ వాటాలపై ఈ నెల 9న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాలని కోరుతూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, సుధాకర్, నందగోపాల్, రామలింగం, ఉదయ్ ఉన్నారు.



ముషీరాబాద్‌లో జోరుగా పొట్టేళ్ల విక్రయాలు



కాచిగూడ కమేళా వద్ద రోడ్డుపైనే పొట్టేళ్ల అమ్మకాలు



టర్కీ దేశానికి చెందిన అరుదైన పొట్టేలు

నేడే బక్రీద్

జోరుగా పొట్టేళ్ల విక్రయాలు

ముషీరాబాద్, గోల్నాక, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు ముషీరాబాద్, భోలక్‌పూర్, గోల్నాక డివిజన్‌లోని కాచిగూడ కమేళాలో మేకలు, గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పురస్కరించుకుని గొర్రెలు, మేకపోతులు, పొట్టేళ్లను బలిదానం చేస్తారనే విషయం తెలిసిందే. శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పొట్టేళ్లను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలు మూడురోజులు ఈ గొర్రెపొట్టేళ్ల విక్రయాలు కొనసాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. గతం కంటే ఈ సారి పొట్టేళ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. ఒక్కో పొట్టేల్ రూ.12వేల నుంచి రూ.15వేలకు విక్రయిస్తున్నారు. జోడి అయితే రూ.25వేల వరకు అమ్ముతున్నారు. గోల్నాకలోని అంబర్‌పేట, సీపీఎల్, గోల్నాక జిందాతిలిస్మాత్ రోడ్డు, కొత్త బ్రిడ్జి, ప్రేమ్‌నగర్, పటేల్ నగర్ ప్రాంతాల్లో రోడ్లపైనే వ్యాపారులు మేకపోతులు, గొర్రె పొట్టేళ్లను అమ్ముతున్నారు.

ముషీరాబాద్: బక్రీద్ పండుగ వచ్చిందంటే ముషీరాబాద్‌లోని ఏక్‌మినార్ వద్ద నివసించే ఓ వ్యక్తి వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రత్యేక ఆకర్షణలో ఉన్న పొటేళ్లను తీసుకువస్తారు. టర్కీ దేశానికి చెందిన పొట్టెల్‌కు ముద్దుగా సుల్తాన్ అని పేరు పెట్టినట్టు అబ్దుల్ రహీం (పాషా) తెలిపారు. దీని ఎత్తు 3 అడుగులు. బరువు 95 కేజీలు ఉంటుంది. పొట్టెల్ వెనక భాగంలో భారీ ఆకారంలో తెల్లటి వర్ణంలో ఆకర్షణీయంగా ఉంది. దీని మాంసం కొంత స్వీటుగా ఉంటుందని యజమాని పాషా తెలిపారు.

'సాహితీ రచనలో సిద్ధహస్తులు ప్రభావతి'

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వివిధ సాహితీ ప్రకియల రచనలో వాసా ప్రభావతి సిద్ధహస్తులని విశ్రాంత ఉన్నతాధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. నవల,కథ, వ్యాసం, నాటకం వంటి ప్రక్రియల్లో ఆమె మంచి రచనలు చేశారన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్- వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో డా.వాసాప్రభావతి శాస్త్రి జయంతి నిర్వహించారు. రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ పద్యకవి, భూమయ్యకు వాసాప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యాధనంజయ్‌కు ప్రభావతి గురుపురస్కారం ప్రదానం చేశారు. ప్రభావతి ఆమె పేరిట సత్కారం పొందిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆచార్య సూర్యాధనంజయ్‌లు అభినందనీయులన్నారు. సాహితీవేత్త ఓలేటిపార్వతీశం, గుడిపాటి, పొత్తూరిసుబ్బారావు, శైలజామిత్ర, కుమార్తె మీనాక్షి, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను గ్రేడ్‌లుగా వర్గీకరణ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు సందిల బలరామ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అసోసియేషన్ పరంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు గల గ్రేడ్‌లను తీసేసి పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులకు అవకాశంలేకుండా చేసిందని ఆరోపించారు.

తానా సభలకు ధర్మారావుకు ఆహ్వానం

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అగ్ర తెలుగు సాంస్కృతిక సేవా సంస్థ తానా 24వ ద్వైవార్షిక ప్రపంచసభలకు ఇట్క్లా, ఫాస్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపకుడు డా. ధర్మారావుకు ఆహ్వానం అందింది. తనను ఆహ్వానించినందుకు ధర్మారావు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ కాలుష్యం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు కళాశాల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ సృజనలు బహుమతులను ప్రదానం చేశారు.

రైలులో సెల్‌ఫోన్ల దొంగలు

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనలో రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల సెల్‌ఫోన్‌లను దొంగలు లాక్కొని పారిపోయారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పురకు చెందిన మహ్మద్ రోక్ మక్తల్ వెళ్లడానికి రాయచూర్ డెమో రైలు ఎక్కాడు. అతని చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగ లాక్కొని పారిపోయాడు. మరో సంఘటనలో మోతీనగర్‌కు చెందిన అనిల్ మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద భరత్‌నగర్ వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా అతని చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగ లాక్కొని పారిపోయాడు. ఇద్దరి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న చిక్కడపల్లి పోలీసు సిబ్బందికి అశోక్‌నగర్ ఫుట్‌పాత్‌పై 50 సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 సిబ్బందిని పిలిపించారు. ఆ వ్యక్తి మరణించాడని వారు నిర్ధారించారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అతని వివరాలు తెలిసినవారు చిక్కడపల్లి పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐ మౌనిక తెలిపారు.

ఏసీ కంప్రెషర్ పేలి అగ్నిప్రమాదం

చిక్కడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని బాపునగర్ మేదరబస్తీలో ఏసీ కంప్రెషర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మ్యూజిక్ స్టూడియోలోని ఖరీదైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేదరబస్తీలో వివేక్‌సాగర్ అనే మ్యూజిక్ డైరెక్టర్ మ్యూజిక్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఏసీ కంప్రెషర్‌లో ప్రెషర్ పెరిగి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కంప్రెసర్‌లో నుంచి పొగలు, మంటలు రావడంతో సిబ్బంది హుటాహుటిన బయటకు పరుగెత్తుకు వచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సంఘటనా స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు అభిషేక్ కెన్నడీ, జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, శంకర్‌గౌడ్ సందర్శించి అగ్నిప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాచిగూడలో వృద్ధురాలి అదృశ్యం

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెద్ద కుమారుడి ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న రాంచందర్ సతీమణి కుందన్‌బాయి (80) ఈ నెల 4న పెద్దకుమారుడికి ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయటకు వచ్చి అదృశ్యమైంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. శుక్రవారం చిన్నకుమారుడు సందీప్‌కుమార్ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.